# క్రీస్తు జీవితము - ఉపదేశములు

## 149 క్రీస్తునందు ప్రత్యక్షమైన దేవుని ప్రేమ

రా - ఆనందభైరవి తా - కురుఝంపె

దేవుని ప్రేమ యిదిగో - జనులార - భావంబునం దెలియరే = కేవలము నమ్ముకొనినఁ - పరలోక - జీవంబు మన కబ్బును ॥దేవుని॥

1. సర్వలోకము మనలను - తన వాక్య - సత్యంబుతోఁ జేసెను = సర్వోపకారుడుండే - మన మీద - జాలిపరుఁడై యుండెను ॥దేవుని॥
2. మానవుల రక్షింపను - దేవుండు - తన కుమారునిఁ బంపెను = మన శరీరముఁ దాల్చెను - ఆ ప్రభువు - మన పాపమునకు దూరుఁడే ॥దేవుని॥
3. యేసుక్రీస్తను పేరున - రక్షకుఁడు వెలసి నాఁడిలలోపల = దోసకారి జనులతో - నెంతోను - భాషలను బల్కినాఁడు ॥దేవుని॥
4. పాపభారంబు తోడ - నే ప్రొద్దు - ప్రయాసములఁ బొందెడి = పాపులందఱు నమ్మిన - విశ్రాంతి - పరిపూర్ణమిత్తు ననెను ॥దేవుని॥
5. సతులైన పురుషులైనన్ - యా కర్త సర్వ జనుల యెడలను = సత్ప్రేమగ నడిచెను - పరలోక సద్బోధలిక జేసెను ॥దేవుని॥
6. చావు నొందిన కొందఱిన్ - యేసుండు - చక్కఁగా బ్రతికించెను = సకల వ్యాధుల రోగులు - ప్రభు నంటి - స్వస్థంబు తా మొందిరి ॥దేవుని॥
7. గాలి సంద్రపు పొంగులన్ - సద్దణపి - నీళ్లపై నడచినాఁడే = మేలు గల యద్భుతములు - ఈలాగు - వేలకొలఁదిగ జేసెను ॥దేవుని॥
8. చేతుల కాళ్లలోను - రా రాజు - చేర మేకులు బొందెను = పాతకులు గొట్టినారే - పరిశుద్ధ - నీతి తా మోర్వలేకన్ ॥దేవుని॥
9. ఒడలు రక్తము గారఁగ - దెబ్బలు - చెడుగు లందఱుఁ గొట్టిరి = వడిముళ్ల తలమీఁదను - బెట్టిరి ఓర్చెనో రక్షకుండు ॥దేవుని॥
10. ఇన్ని బాధలు బెట్టుచుఁ - దనుఁ జంపు - చున్న పాప నరులను = మన్నించు మని తండ్రిని - యేసుండు - సన్నుతితో వేఁడెను ॥దేవుని॥



11. రక్షకుడు శ్రమఁ బొందఁగా - దేశంబు - తక్షణము చీఁక టయ్యెన్ = రక్షకుఁడు మృతి నొందఁగఁ - తెర చినిఁగి - రాతి కొండలు పగిలెను ॥దేవుని॥
12. రాతి సమాధిలోను - రక్షకుని - నీతిగల దేహంబును = పాఁతి పెట్టిరి భక్తులు - నమ్మిన - నాతు లందఱుఁ జూడఁగా ॥దేవుని॥
13. మూఁడవ దినమందున - యేసుండు - మృతి గెల్చి లేచినాఁడు = నాఁడు నమ్మిన మనుజులు - చూచిరి - నలువది దినములందున్ ॥దేవుని॥
14. పదునొకండు మారులు - వారలకుఁ - బ్రత్యక్షుఁ డాయె నేసు = పర లోకమున కేగెను - తన వార్తఁ - బ్రకటించు మని పల్కెను ॥దేవుని॥
15. నమ్మి బాప్తిస్మమొందు - నరులకు - రక్షణ మరి కల్గును = నమ్మ నొల్లక పోయెదు - నరులకు - నరకంబు సిద్ధమనెను ॥దేవుని॥

- గొల్లపల్లి నతానియేలు

## 150 లాజరును తిరిగి బ్రతికించుట

రా - శంకరాభరణము తా - ఆది

వినరె మనుజులార క్రీస్తుఁ - [1]డిలనుఁ జేయు ఘనములైన = పనులలోనఁ జిత్రమొక్క - పని [2]వచించెద ॥వినరె॥

1. మన మనంబు [3]లలరుచుండ - దినదినంబు ప్రభుని నిండు = ఘన మహాద్భుతములు వినినఁ - [4]దనివిఁ దీరదు ॥వినరె॥
2. ఇలను బేతనియపురంబు - గలదు మరియ మార్తలక్క = సెలియలందు వాసముండి - [5]రెలమితోడను ॥వినరె॥
3. పరిమళంపు తైలమేసు - చరణములకుఁ బూసిన యా = మరియ సోదరుండు రోగ - భరితుఁడయ్యెను ॥వినరె॥
4. వ్యాధిచేత లాజరుండు - బాధనొందుచుండఁ గ్రీస్తు = నాథుఁ బిలువనంపి రపుడు - [6]నాతు లిరువురు ॥వినరె॥
5. తమ్ము డక్క సెలియలును బ్రి - యమ్ము తనకుఁ గలిగియుండ = నమ్మహాత్ముఁ డైన క్రీస్తుఁ [7]డరిగె నచటికి ॥వినరె॥

---

[1]భూమిలో. [2]చెప్పెద. [3]ప్రకాశించుచుండు. [4]తృప్తి. [5]సంతోషము. [6]స్త్రీలు. [7]పోయె.